క్లుప్తంగా

బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఐ అనిల్‌కుమార్, కానిస్టేబుళ్లు

పెద్దారవీడు: మండలంలోని కలనూతల పంచాయతీ పరిధి అటవీ ప్రాంతంలో నాటుసారా తయారు చేస్తున్న బెల్లం ఊటను పోలీసులు సోమవారం ధ్వంసం చేశారు. నాటుసారా తయారు ప్రాంతాన్ని పరిశీలించి 600 లీటర్ల ఊట బెల్లం ఊటను ధ్వంసం చేశామని ఎస్‌ఐ అనిల్‌కుమార్, ఎస్‌బీ ఏఎస్‌ఐ మాల్యాద్రి తెలిపారు. ఎస్‌ఐ అనిల్‌కుమార్ మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో నాటుసారా శిబిరాలపై దాడి చేస్తామని, చట్టవ్యతిరేక చర్యలను పూర్తిగా నిర్మూలిస్తామని, నాటుసారా తయారీదారులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇలాగైతే ఎలా?


కర్నూల్-గుంటూరు ప్రధాన రహదారిలో నిలిపి ఉన్న వాహనాలు


వాసవీ కన్యకా పరమేశ్వరి బజారులో వాహనాలు ఇలా..

- వాహనాలను ఇష్టారీతిన పార్కింగ్ చేస్తున్న యజమానులు
- పెద్దదోర్నాలలో తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు

పెద్దదోర్నాల: అనునిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులపైనే పలువురు వాహనదారులు తమ వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనాలకు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రంలో పలు ప్రాంతాల్లోని వ్యాపార సముదాయాలన్నీ ప్రధాన రహదారులకే ఆనుకుని ఉన్నాయి. దీంతో అయా సముదాయాలకు వచ్చే వినియోగదారుల వాహనాలు రోడ్లపైనే పార్కింగ్ చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరికి వారు తమ వాహనాలను ఇష్టానుసారంగా రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో తరుచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీనికితోడు వ్యాపార సముదాయాల ఎదురుగా ఉన్న నడక మార్గాలు అక్రమణకు గురపటంతో పాదచారులు రోడ్డుపై నడిచి వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి ప్రజలు నిత్యావసరాలు, కూరగాయలతో పాటు దుస్తులు తదితర వాటిని కొనుగోలు చేసేందుకు మండల కేంద్రానికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని కర్నూల్- గుంటూరు జాతీయ రహదారి, శ్రీశైలం రోడ్డుతో పాటు అంతర్గత రహదారులైన వాసవీ కన్యకా పరమేశ్వరి రహదారి, గాంధీ బజార్, నాగేంద్రరెడ్డి జిరాక్స్ వీధుల్లో తరుచూ ఇబ్బందులు తలెత్తుతుండటంతో ప్రజలు తీవ్ర అసౌర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు పార్కింగ్ చేసిన వారితో పాటు వ్యాపార సముదాయాల యజమానులకు కౌన్సిలింగ్ ఇస్తే పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశం ఉందని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు ఎప్పటికప్పుడు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి వ్యాపార సముదాయాల యజమానులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

మూలమలుపుల్లో స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి


పుచ్చకాయలపల్లి వెళ్లే రోడ్డు మూలమలుపు

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు నుంచి పుచ్చకాయలపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో ప్రమాదకరంగా మూలమలుపులు ఉన్నాయి. పుచ్చకాయలపల్లి నుంచి మండల కేంద్రం పెద్దారవీడుకు వివిధ పనులపై ప్రజలు వస్తుంటారు. నిత్యం ఈ రోడ్డులో ఆటోలు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూలమలుపు వద్ద ఇళ్లు ఉండటంతో చిన్నారులు ఆటలు ఆడుకుంటారు. వాహనాలు తగిలి ప్రమాదాలు జరుగుతాయనే భయంతో ఉన్నామని స్థానికులు చెబుతున్నారు. మూలమలుపుల వద్ద గుంతలు ఏర్పడటంతో ఎదురు ఎదురుగా వస్తున్న వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి మూలమలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా వేగం తగ్గించేందుకు స్పీడ్ బ్రేకర్లు వేసి ప్రమాదాలు నివారించాలని, గుంతలు పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గంగదేవిపల్లిలో సెమీ క్రిస్మస్ వేడుకలు


ప్రసంగిస్తున్న తెనాలి రవీంద్రబాబు


వృద్ధులకు దుస్తులు అందిస్తున్న సుధాకర్‌రావు

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లిలో మండల పాస్టర్ ఫెలోషిప్ సమక్షంలో క్రైస్ట్ ఫర్ ఇండియా మిషన్ సొసైటీ ఫౌండర్ డైరెక్టర్ బ్రదర్ ఆర్.సుధాకర్‌రావు అధ్యక్షతన సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి ఒకరినొకరు శుభ సందేశం అందించారు. పాస్టర్లకు దస్తులు, వితంతువులకు, వృద్ధులకు చీరల పంపిణీ చేశారు. దొనకొండలో బ్రదర్ సుధాకర్‌రావు పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం సుధాకర్‌రావును ఘనంగా సన్మానించారు. టి.పాపారావు, గుడిమెట్ల యేసయ్య, రమేష్, దాసు, క్రిష్టాఫర్, శ్యామ్, జాన్సన్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

పెద్దోర్నాల: క్రీస్తు జననం దేవుడిని మానవుడి చెంతకు తెచ్చిందని గుంటూరు ఉజ్జీవ ప్రసంగీకులు తెనాలి రవీంద్రబాబు చెప్పారు. పెద్దదోర్నాల క్రిస్టియన్స్ పాస్టర్స్ అండ్ ఇవాంజిలిస్ట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉజ్జీవ ప్రసంగీకులు తెనాలి రవీంద్రబాబు మాట్లాడుతూ క్రిస్మస్ అంటే క్రీస్తును ఆరాధించడమే అన్నారు. క్రిస్మస్ ప్రపంచంలోనే అతి పెద్ద పండగని కొనియాడారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి ఆనందోత్సాహాల నడుమ అందరికీ పంపిణీ చేశారు. దైవజనులు పెద్ద యేసయ్య, సుధీర్‌బాబు, దర్శనం గౌతం యల్లయ్య, తంగిరాల సురేష్, పూర్ణకంటి చంద్ర, బాబూరావు, యోహాన్, పూర్ణకంటి వెంకటయ్య, ఉప్పలపాటి వినోద్, ఏసురత్నం, పెద్ద కాశయ్య పాల్గొన్నారు.

నేడు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

దర్శి: జాతీయ విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం సందర్భంగా మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశం అద్దంకి రోడ్డులోని రామాలయం గుడి ప్రాంగణంలో మంగళవారం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు ఆర్. వెంకటరెడ్డి తెలిపారు. దర్శి సబ్‌ట్రెజరి పరిధిలోని విశ్రాంత ఉద్యోగులందరూ హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు.


ఉమ్మడివరంలో పూజలు చేస్తున్న భక్తులు


పుల్లలచెరువులో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు


ముస్తాబైన లక్ష్మీనృసింహస్వామి

పుణ్యప్రదం.. ధనుర్మాసం

పుల్లలచెరువు: ధనుర్మాస ఉత్సవాలు గ్రామాల్లోని ఆలయాల్లో సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 16వ తేదీ నుంచి జనవరి 13 వరకు ఉత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ గ్రామాల్లో నగర సంకీర్తణ, సుప్రభాత సేవ, ఆరాధన, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. జనవరి 10వ తేదీన ముక్కోటి ఏకాదశ సందర్భంగా ఉదయం 4 గంటల నుంచి భక్తులు స్వామి వారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ మాసంలో గృహిణులు ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు పెట్టడం సంప్రదాయంగా వస్తోంది. కొందరు గొబ్బెమ్మలను కూడా ఇళ్ల ముందు అలంకరణ చేస్తారు. మండలంలోని ప్రతి వైష్ణవ ఆలయాల్లో ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు.

పెద్దదోర్నాల: ధనుర్మాసం పూజలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయని లక్ష్మీనృసింహస్వామి ఆలయ అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యులు పేర్కొన్నారు. అత్యంత పవిత్ర ధనుర్మాసంలో నెల రోజుల పాటు నియమ నిష్ఠలతో వ్రతం నిర్వహిస్తే అంతా మంచే జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని చెప్పారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి


గ్రామసభలో దరఖాస్తులు అందజేస్తున్న రైతు


అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్ రమాదేవి

దొనకొండ: రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని యర్రబాలెం ప్రజలు తహసీల్దార్ బి.రమాదేవికి సోమవారం వినతి పత్రాలు అందజేశారు. మండలంలోని యర్రబాలెంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 14 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. తమ సిబ్బందితో పరిష్కరించి అర్హులైన వారికి న్యాయం చేస్తామని ఆమె పేర్కొన్నారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగార్జున రెడ్డి, ఆర్ఐ రామారావు, వీఆర్‌ఓ మాచర్ల, సర్వేయర్ ఎం.శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లూరు: మండంలోని బెల్లంకొండవారిపాలెంలో సోమవారం జరిగిన రెవెన్యూ గ్రామసభకు 9 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సంజీవరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములకు సంబంధించిన ఎలాంటి సమస్యలు ఉన్నా రైతులు అర్జీల రూపంలో తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామసభలో భూ సర్వే కోసం 2, ఆన్‌లైన్ కోసం 7 అర్జీలు అందాయన్నారు. డీటీ ఇమ్మానియేలు, వీఆర్‌ఓ రమణ, సర్వేయర్ శ్రీనివాసరావు, సర్పంచ్ పి.సుమలత, శ్రీకాంత్, ఎంపీటీసీ సభ్యుడు జి.సరస్వతి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ


ఎరువుల డిపోను తనిఖీ చేస్తున్న ఏఓ ప్రసాద్‌రావు

దర్శి: ఎరువుల దుకాణాలపై నిరంతరం నిఘా ఉంటుందని, తద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు అందించడంతో పాటు సరఫరాలో కొరత లేకుండా అవసరమైనవి అందుబాటులో ఉంచేందుకు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు క్వాలిటీ కంట్రోల్ అధికారి బి.ప్రసాద్‌రావు తెలిపారు. తాళ్లూరు మండల వ్యవసాయాధికారి తూర్పుగంగవరం గ్రామంలోని శ్రీ సాయి రైతు డిపోను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఏపీ, 18.46.0 శాంపిల్స్ తీసుకొని రిజనల్ కోడింగ్ సెంటర్ విశాఖపట్నం, డీఏఓ పల్నాడు వారికి పంపించారు. పరీక్షల అనంతరం రిపోర్టుల ఆధారంగా వాటిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏఈఓ నాగరాజు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి


పెద్దారవీడు: శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జాన్‌సుందరం

తాళ్లూరు: గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ సుందరరామయ్య అన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు ఏపీఎస్ఐఆర్డీపీఆర్ ఆధ్వర్యంలో గ్రామ స్వరాజ్ అభియాన కింద శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు మారం వెంకారెడ్డి, సూపర్‌వైజర్ జ్యోతి, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: గ్రామ పంచాయతీల సుస్థిరాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ జాన్‌సుందరం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాలులో పంచాయతీల అభివృద్ధిపై సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీలకు వచ్చే నిధుల రాబడి, సాధారణ నిధుల లభ్యతను దృష్టిలో ఉంచుకొని ముందస్తుగానే గ్రామ అభివృద్ధి ప్రణాళికను తయారు చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలకు సహాయ సహకారం అవసరమని తెలిపారు. సమావేశంలో ఈఓఆర్డీ రాజ్‌కుమార్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన


పొదుపుపై అవగాహన కలిగిస్తున్న ఈఈ శ్రీనివాసరావు

దర్శి: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఏపీ మోడల్ పాఠశాలలో సోమవారం విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసరావు ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ ఉత్పత్తికి మూలమైన బొగ్గు, డీజిల్ లాంటివి తగ్గించాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. ఎస్ స్టార్ రేటెడ్ వస్తువులు వాడాలని, అవసరం లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు ఆపు చేయాలని సూచించారు. తక్కువ విద్యుత్ వాడకంతో ఎక్కువ పనితనం ఇచ్చే పరికరాలను వాడి విద్యుత్ పొదుపు చేయాలని సూచించారు. విద్యుత్ పొదుపు ప్రగతికి మలపు అని, పొదుపు పాటించి భావితరాలకు వెలుగునిద్దామని, పొదుపు ఒక సామాజిక బాధ్యతగా పాటించాలని సూచించారు. ఏసీలను 24 డిగ్రీల కంటే ఎక్కువ టెంపరేచర్ దగ్గర మెయింటెన్ చేసి బిల్లు తగ్గించుకోవచ్చని సూచించారు. విద్యుత్ పొదుపు పాటించి బిల్లు తగ్గించుకోవచ్చని, పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇంటిపై సోలార్ ప్లేట్లు అమర్చుకొని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చని, పీఎం సుర్యాన్ ఘర్ పథకం కింద ఒక్కో కిలో వాట్‌కు రూ.30 వేల సబ్సిడీగా పొందవచ్చని, 3 కిలోవాట్స్‌కి రూ.78 వేలు సబ్సిడీ పొందవచ్చన్నారు. ఈ పథకాన్ని విరివిగా ఉపయోగించుకొని బిల్లు తగ్గించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలని కోరారు. ఏఈలు అంకబాబు, వేణుగోపాల్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల ఘోష.. సర్కారుకు తమాషా!

- అధిక వర్షాలు, కరువుతో పొదిలి మండలంలో దెబ్బతిన్న పంటలు
- 660 హెక్టార్లలో వివిధ రకాలకు పంటలకు నష్టం
- గత ప్రభుత్వంలో మంజూరు చేసిన పరిహారం నేటికీ అందించని వైనం
- రూ.60 లక్షల మేర పరిహారం కోసం 1160 మంది రైతుల ఎదురుచూపులు


కొండాయపాలెంలో వర్షానికి దెబ్బతిన్న సజ్జ పంటను పరిశీలిస్తున్న మంత్రి డోలా, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల (ఫైల్)

పొదిలి రూరల్: ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోయిన రైతులు పరిహారం కోసం దీనంగా ఎదురుచూస్తున్నారు. నష్టం అంచనా జాబితాలు ప్రభుత్వానికి చేరి నెలలు గడుస్తున్నా పరిహారం నగదు అందించకుండా మీనమేషాలు లెక్కిస్తుండటంతో రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. చంద్రబాబునాయుడు ఎప్పుడు అధికారంలో ఉన్నా రైతులు, వ్యవసాయంపై నిర్లక్ష్యం చూపుతారనేందుకు పరిహారం మంజూరులో జాప్యమే నిదర్శనమని రైతులు విమర్శిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గత ఏడాది పొదిలి మండలంలో రబీ, ఖరీఫ్ సీజన్లలో సాగు చేసిన వరి, మినుము, శనగ, సజ్జ పంటలు వర్షానికి దెబ్బతిన్నాయి. దాదాపు 660 హెక్టార్లలో పంటలు దెబ్బతినడంతో 1160 మంది రైతులు నష్టపోయారు. ఈ మేరకు అప్పటి ప్రభుత్వానికి స్థానిక అధికారులు నివేదిక తయారు చేసి పంపగా రూ.60 లక్షలు మంజూరు చేశారు. అదే సమయంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రైతులకు పరిహారం నగదు పంపిణీ చేసేందుకు ఎలక్షన్ కమిషన్ మోకాలడ్డింది. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పరిహారం చెల్లింపు గురించి నేటికీ పట్టించుకోలేదు.

పరిహారం కోసం రైతుల ఎదురుచూపు

పొదిలి మండలంలోని అముదాలపల్లి, కుంచేపల్లి, పాములపాడు, ఏలూరు, పొదిలి, మూగచింతల, కంభాలపాడు, ఉప్పలపాడు, చింతగుంపల్లి, తలమళ్ల, మాదాలవారిపాలెం, ఓబులక్కపల్లి, నందిపాలెం, దొండ్లేరు, కొండాయపాలెం, సలకనూతల, మల్లవరం, జువ్వలేరు, తుమ్మగుంట, అన్నవరం, సూదనగుంట గ్రామాల్లో 2023- రబీ, ఖరీఫ్, 2024 ఖరీఫ్ సీజన్‌లో వరి మినుము, శనగ, సజ్జ పంటలు సాగు చేశారు. నాడు కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు నిలిచి పైర్లు దెబ్బతిన్నాయి. అలాగే తేమ శాతం పెరిగి తెగుళ్ల విజృంభించడంతో దిగుబడులు పడిపోయాయి. పంట నష్ట పోయిన తీరును వ్యవసాయాధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. రైతులను ఆదుకోవడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా అప్పటి వైఎస్ జగన్ ప్రభుత్వం నష్ట పరిహారాన్ని అందించేందుకు సిద్ధమైంది. రైతుల వ్యక్తిగత ఖాతాల్లో నగదు జమ చేసే సమయంలో ఎన్నికల కోడ్ కారణంగా అదేమీ కుదరదని ఎలక్షన్ కమిషన్ అడ్డు చెప్పడంతో చెల్లింపులు నిలిచిపోయాయి. ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం పరిహారం చెల్లింపు విషయాన్ని పూర్తిగా పక్కనపెట్టేసింది. నేటికీ పరిహారం నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ చేయకపోవడంతో 1160 మంది రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడో ఇవ్వాల్సిన నిధులను పంపిణీ చేయడానికి కూటమి ప్రభుత్వానికి చేతులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నష్టం అంచనాలు ఇలా..

- 2023-రబీ సీజన్‌లో అధిక వర్షపాతం వల్ల మండలంలో 87 మంది రైతులు 44.2 హెక్టార్లలో వరి పంట నష్టపోయారు. ఈ మేరకు నష్టం అంచనా నివేదిక గత ప్రభుత్వానికి అందడంతో రూ.7,05,536 మంజూరు చేసింది.
- అధిక కరువు వల్ల 325 మంది రైతులు 181 హెక్టార్లలో మినుము, శనగ పంటలు కోల్పోయారు. దీనికిగాను రైతులకు రూ.18,10,200 పరిహారం అందించాలని అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపగా నిధులు మంజూరు చేశారు.
- 2024లో ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షపాతంతో 748 మంది రైతులు 434 హెక్టార్లలో సజ్జ పంటను నష్టపోయారు. రైతులకు రూ.36,90,275 లక్షల పరిహారం అందించాలని అధికారులు నివేదిక పంపగా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. సజ్జ పంట దెబ్బతిన్న తీరును పరిశీలించేందుకు మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తదితరులు పొదిలి మండలంలోని కొండాయపాలెంలో పర్యటించారు. అధికారులు నివేదిక ఇస్తే ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి పరిహారం మంజూరు చేయిస్తామని చెప్పారు. కానీ, ఇంత వరకు ప్రభుత్వం నుంచి రైతులకు పైసా పరిహారం అందలేదు.